సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

మంగళవారం । 12 । మార్చి । 2024



200 కిలోల గంజాయి స్వాధీనం
ట్రాక్టర్‌పై తరలిస్తున్న 200 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకుని, ఇద్దరిని అరెస్టు చేశారు.
8లో



స్వయంఉపాధితో ఆర్థికాభివృద్ధి
గిరిజన రైతులు స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి సాధించాలని పశుసంవర్ధకశాఖ జేడీ సీహెచ్.నరసింహులు కోరారు.
8లో

రంజాన్ వేళలు

పాడేరు,అరకు
ఇఫ్తార్ (మంగళ) 6.09 — సహర్ (బుధ) 4.53
రంపచోడవరం
6.05 — 4.52

న్యూస్‌రీల్

అరకు,బొర్రాగుహలు స్టేషన్లలో వన్ స్టేషన్ వన్ ప్రొడక్ట్ స్టాళ్లు

- నేడు వర్చువల్ విధానంలో ప్రారంభించనున్న ప్రధాని

అరకులోయ: కేంద్ర ప్రభుత్వం అమలుజేస్తున్న వన్‌స్టేషన్-వన్‌ప్రొడక్ట్ స్టాళ్లను అరకులోయ, బొర్రాగుహలు రైల్వేస్టేషన్లలో ఏర్పాటు చేశారు. వాటిని ప్రధానమంత్రి నరేంద్రమోదీ మంగళవారం వర్చువల్ విధానంలో ప్రారంభించనున్నారు. కొత్తవలస-కోరాపుట్ డబుల్ రైల్వేలైన్ కూడా జాతికి అంకితం చేయనున్నారు. ఈ రెండు కార్యక్రమాలకు సంబంధించి అరకులోయ రైల్వే స్టేషన్‌లో వర్చువల్ విధానంలో ప్రధానమంత్రి ప్రజలకు సందేశం ఇవ్వనున్నారు. ఈమేరకు కమ్మరి, స్వర్ణకారులు, కుమ్మరులు, క్షురకులు, రజకులు తదితర చేతి వృత్తిదారులంతా ఈసమావేశానికి హాజరయ్యేవిధంగా రైల్వేశాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమానికి సంబంధించి ప్రత్యక్ష ప్రసారాన్ని అరకులోయ రైల్వే స్టేషన్లో ఏర్పాటు చేశారు.

నేడు జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

మహారాణిపేట(విశాఖ): జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు మంగళవారం నిర్వహించనున్నట్టు జెడ్పీ సీఈవో ఎం.పోలినాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన సమావేశాలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లా అధికారులు తమ శాఖల ద్వారా అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాల సమగ్ర ప్రగతి నివేదికలతో సమావేశాలకు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

పవర్ టిల్లర్లు, వీడర్ల పంపిణీ



రైతులకు పవర్ టిల్లర్లు, పవర్ వీడర్లు అందజేస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు: పీవీటీజీ గిరిజన రైతులు యంత్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ పీవో అభిషేక్ అన్నారు. ఐటీడీఏ కార్యాలయ ఆవరణంలో రూ.29.99 లక్షల విలువ చేసే 14 పవర్ టిల్లర్లు, రూ.1.57 కోట్ల విలువ చేసే 140 పవర్ వీడర్లను గిరిజన రైతులకు సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్బంగా పీవో అభిషేక్ మాట్లాడుతూ.. యంత్రాల వినియోగంతో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సహాయప్రాజెక్టు అధికారులు ప్రభాకర్‌రావు, వెంకటేశ్వరరావు, ప్రాజెక్టు ఉద్యానవనశాఖ అధికారి అశోక్, జిల్లా ఉద్యానవనశాఖ అధికారి రమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉన్నతి జాబ్ మేళా

జి.మాడుగుల: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి నిరుద్యోగులకు ఎంజీఎన్ ఆర్‌ఈజీఎస్ ఆధ్వర్యంలో ఉన్నతి జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో, ఎంజీఎన్ఆర్ఈజీఎస్ ప్రోగ్రాం అధికారి ఆర్.లోహిత్ జయసాగర్, ఏపీవో కొండబాబు తెలిపారు. టెన్త్ ఆపై చదువుకుని ఖాళీగా ఉన్న యువతీయువకులు ఈ జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉపాధి హామీ పథకంలో 100 రోజుల పనిదినాలు పూర్తి చేసిన కుటుంబాల్లోని నిరుద్యోగులకు ప్రాధాన్యం ఇస్తున్నట్టు చెప్పారు. అభ్యర్థుల నైపుణ్యానికి అనుగుణంగా శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తామన్నారు. శిక్షణకాలంలో వేజ్ అలవెన్సు అందజేస్తామని చెప్పారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులు విద్యార్హతలకు సంబంధించి ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, బియ్యం కార్డు, ఉపాధి జాబ్ కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు తీసుకురావాలని తెలిపారు.

ఘనంగా ప్రభల ఊరేగింపు



వీఆర్‌పురంలో ప్రభను ఊరేగిస్తున్న భక్తులు

వీఆర్‌పురం: శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా వడ్డిగూడెం శ్రీసతీరుద్రకోటేశ్వర స్వామి వారి ఆలయంలో ప్రభల ఊరేగింపును సోమవారం ఘనంగా నిర్వహించారు. ఏటామాదిరిగానే మొక్కుకున్న భక్తులు ప్రభలను స్వయంగా తయారు చేసి, ఊరేగింపుగా తీసుకెళ్లి స్వామివారికి సమర్పించారు. ఊరేగింపు ధర్మతాళ్లగూడెం, వీఆర్‌పురం, వడ్డిగుడెంకాలనీ, వడ్డిగూడెం గ్రామాల మీదుగా స్వామి వారి ఆలయం వరకు సాగింది. ఊరేగింపులో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

‘ఉపాధి’ మెండుగా..
పనుల పండగ

- వలసల నివారణ లక్ష్యంగా ఉపాధి హామీ పనులు కల్పన
- వ్యక్తిగత పంట భూములు, చెరువులు, పంట కాల్వల అభివృద్ధికి ప్రాధాన్యం
- జిల్లాలో 3,722 గ్రామాల్లో జోరుగా పనులు
- 41,714 పనులకు రూ.86,474 లక్షలు మంజూరు
- 75,651 మంది గిరిజనులకు చేతినిండా పని



పెదబయలు మండలం కూతంగిపుట్టులో ఉపాధి పనులు చేస్తున్న గిరిజనులు



హుకుంపేట మండలం అడ్డుమండ సమీపంలో వ్యక్తిగత పంట భూమిలో పనులు చేస్తున్న గిరిజనులు

సాక్షి,పాడేరు: జిల్లాలో ఉపాధి పనులు పెద్ద ఎత్తున జోరుగా సాగుతున్నాయి. ఈ సీజన్‌లో వ్యవసాయ పనులు లేక ఖాళీగా ఉన్న గిరిజనులంతా దూర ప్రాంతాలకు కుటుంబాలతో వలస పోకుండా ప్రభుత్వ యంత్రాంగం ముందస్తుగానే అప్రమత్తమైంది. వలసల నివారణతో పాటు స్థానికంగానే కూలీ పనులు కల్పించే లక్ష్యంతో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పెద్ద ఎత్తున పనులను కల్పించడంతో జిల్లా వ్యాప్తంగా ఉపాధి హామీ పనులు జోరందుకున్నాయి.

ఈ ఏడాది లక్ష్యం 2.58 కోట్ల పనిదినాలు

జిల్లాలోని జిల్లాలోని 352 గ్రామ సచివాలయాల పరిధిలో 3,722 గ్రామాల్లో 41,714 ఉపాధి పనులను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. ఇందుకు రూ.86,474 లక్షలు అందుబాటులో ఉంచింది. ఈ ఏడాది 2,58,74,726 పనిదినాలను కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రతి రోజు లక్ష మంది కూలీలకు పనులు కల్పించనున్నారు. ప్రస్తుతం ప్రతి రోజూ 75,651మంది వేతనదారులు పనులు చేస్తున్నారు. మిగిలిన గిరిజనులు కూడా ఉపాధి పనులను సద్వినియోగం చేసుకునే విధంగా ఉపాధి హామీ పథకం సిబ్బంది గ్రామాలను సందర్శిస్తూ చైతన్యపరుస్తున్నారు.

స్థానికంగానే..

స్థానికంగానే తమ గ్రామాల సమీపంలో ఉపాధి పనులు మంజూరడంతో గిరిజనులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వ్యక్తిగత పంటల భూముల అభివృద్ధి, పంట కాల్వల తవ్వకాలు, గట్ల నిర్మాణాలు, చెరువుల్లో పూడికతీత వంటి పనులు చేపడుతున్నారు. చేతి నిండా పనులు అందుబాటులో ఉండడంతో వేసవిలో గిరిజనులు దూర ప్రాంతాలకు వలసలు వెళ్లే పరిస్థితి తప్పింది. కుటుంబాలతో సొంత గ్రామంలోనే ఉంటూ జీవనోపాధి పొందవచ్చు. పాడేరు, రంపచోడవరం, చింతూరు ఐటీడీఏ పీవోలు, ఉపాధి హామీ పథకం అధికారులతో రోజువారీ సమీక్షలు నిర్వహిస్తుండంతో ఉపాధి పనులు జోరందుకున్నాయి.

వ్యవసాయాభివృద్ధి పనులకే అధిక ప్రాధాన్యత

వ్యవసాయాభివృద్ధి లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా 41,714 ఉపాధి పనులను ప్రభుత్వం మంజూరు చేసింది. పనుల సమయంలో కూలీలకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు. రోజువారీ ఉపాధి పనులను వీఆర్‌పీలు పర్యవేక్షిస్తున్నారు. అటవీ హక్కు పత్రాలు మంజూరు చేసిన కొండప్రాంతాలలో భూములతో పాటు జిల్లా వ్యాప్తంగా రాతిగట్లు, నీటి నిల్వ ఉండేందుకు కందకాలు, చెరువులు, అమృత్ సరోవర్ చెరువులు, మెట్ట భూముల అభివృద్ధి, పంట భూముల అభివృద్ధి తదితర పనులు జరుగుతున్నాయి. ప్రభుత్వం మంజూరు చేసిన గృహ నిర్మాణాలు, రోడ్లు,ఇతర ప్రభుత్వ ప్రాధాన్యత భవన నిర్మాణాల పనులను కూడా జాబ్‌కార్డుదారులు సద్వినియోగం చేసుకుంటున్నారు.రోజు కూలిని రూ.253.12పైసలను ప్రభుత్వం అమలుజేస్తోంది. ఉపాధి పనులన్నింటికి చెల్లింపులు కూడా సకాలంలో జరుగుతుండడంతో గిరిజనులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో జాబ్‌కార్డులు	2,39,092
యాక్టివ్‌గా ఉన్న జాబ్‌కార్డులు	2,00,560
మొత్తం కూలీల సంఖ్య	4,59,395

పనులు పుష్కలం



జిల్లాలోని జాబ్‌కార్డుదారులకు స్థానికంగానే ఉపాధి పనులు కల్పిస్తున్నాం. వలసల నివారణ లక్ష్యంగా గిరిజనుల విన్నపం మేరకే గ్రామాల్లో పుష్కలంగా ఉపాధి పనులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఉపాధి హామీ పనులను జిల్లాలోని జాబ్‌కార్డు ఉన్న కుటుంబాలన్నీ సద్వినియోగం చేసుకోవాలి. ఉపాధి పనులలో కూలీలు భాగస్వామ్యం మరింత పేరిగే విధంగా చర్యలు తీసుకుంటున్నాం.
– శివయ్య, డ్వామా పీడీ,పాడేరు

స్థానికంగానే ఉపాధితో మేలు



ఈ ఏడాది ముందస్తుగానే పనులు మంజూరు కావడంతో గ్రామాల్లోనే ఉపాధి లభిస్తోంది. కూలిపనులకు వలసలు వెళ్లి ఇబ్బందులు పడే పరిస్థితి తప్పింది. స్థానికంగా వ్యవసాయాభివృద్ధి పనులు పుష్కలంగా ఉన్నాయి. ఉపాధి పనులను సద్వినియోగం చేసుకుంటున్నాం.
– జన్ని చెల్లయ్య, జర్రకొండ గ్రామం, హుకుంపేట మండలం

రంజాన్ ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభం



పాడేరులోని పురాతన మసీదులో నమాజ్ చేస్తున్న ముస్లింలు

సాక్షి, పాడేరు/చింతూరు: ముస్లింలకు ఎంతో శుభప్రదమైన రంజాన్ మాసం మంగళవారం నుంచి ప్రారంభమైంది. జిల్లా వ్యాప్తంగా అన్ని మసీదుల్లోను సోమవారం రాత్రి 8.30 గంటల నుంచి ప్రత్యేక నమాజ్‌ను ప్రారంభించారు. జిల్లా కేంద్రమైన పాడేరులోని పురాతన మసీదుతో పాటు అరకులోయ, హుకుంపేట, గుత్తులపుట్టు, జి.మాడుగుల, చింతపల్లిలోని మసీదుల్లోనూ రంజాన్ మాస ప్రార్థనలు మొదలయ్యాయి. రాత్రి తరావీహ్ నమాజ్‌ను ఆచరించిన ముస్లింలు మంగళవారం తెల్లవారు నుంచి ఉపవాస దీక్షలు ప్రారంభించారు. రంజాన్ నెల వచ్చిందంటే ముస్లింలు నివసించే ప్రాంతాల్లో పండగ వాతావరణం నెలకొంటుంది. పెద్దలు, పిల్లలు ఉపవాస దీక్షలు చేపట్టేందుకు ఆరాటపడతారు. ఈ నెలంతా మసీదులన్నీ కోలాహలంగా మారిపోతాయి. ఈనెలలో పవిత్ర ఖురాన్ గ్రంథం అవతరించడమే రంజాన్ నెలకు ప్రాముఖ్యత ఏర్పడింది.

పరిమితికి మించి
చెట్ల నరికివేతపై దర్యాప్తు

- హైవే విస్తరణ కోసం కృష్ణదేవిపేట రేంజ్‌లో 59 చెట్ల తొలగింపు
- పరిధి దాటిన అల్లూరి జిల్లా అటవీ సిబ్బంది
- సీసీఎఫ్ ఆదేశాల మేరకు ఉన్నత స్థాయి విచారణ



ఘాట్‌రోడ్డులో చర్చిస్తున్న స్క్వాడ్ డీఎఫ్‌వో, చింతపల్లి డీఎఫ్‌వో, అటవీ సిబ్బంది



నరికిన చెట్టు మొదలును కొలుస్తున్న అటవీ సిబ్బంది

కొయ్యూరు: చింతాలమ్మ ఘాట్‌రోడ్డులో 516 ఈ జాతీయ రహదారి విస్తరణ కోసం అటవీ శాఖ రిజర్వ్ ఫారెస్టులో పరిమితికి మించి చెట్లను నరికారన్న ఆరోపణపై ఉత్తరాంధ్ర స్క్వాడ్ డీఎఫ్‌వో సోమసుందరం సోమవారం విచారణ చేశారు. చింతాలమ్మ ఘాట్‌లో నరికిన చెట్లను సీసీఎఫ్ శ్రీకంఠనాగిరెడ్డి ఆదేశాల మేరకు పరిశీలించారు. అనకాపల్లి జిల్లా కృష్ణదేవి పేట రేంజ్ పరిధిలోని 59 చెట్లను అల్లూరి జిల్లా పెదవలస రేంజ్ అటవీ సిబ్బంది నరికారు. కృష్ణదేవిపేట రేంజ్ అధికారులు చెట్లు నరికి ఉండడాన్ని గమనించి, అనకాపల్లి డీఎఫ్‌వో జగన్నాథ్‌సింగ్‌కు ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న సీసీఎఫ్ నాగిరెడ్డి అల్లూరి డీఎఫ్‌వో సూర్యనారాయణ పడాల్, అనకాపల్లి డీఎఫ్‌వో జతన్నాథ్‌సింగ్, స్క్వాడ్ డీఎఫ్‌వో సోమసుందరంలతో కమిటీని ఏర్పాటు చేసి, విచారణకు ఆదేశించారు. ఘాట్‌లో నరికిన చెట్ల మొదళ్లను విచారణలో భాగంగా సోమవారం కొలిచారు. అనకాపల్లి డీఎఫ్‌వో సెలవులో ఉండడంతో యలమంచిలి సబ్ డీఎఫ్‌వో సునీల్‌కుమార్ పాల్గొన్నారు. జాతీయ రహదారి సిబ్బంది మార్క్ చేసిన దాని కంటే పరిధి దాటి అదనంగా 35 చెట్లను పెదవలస అటవీ సిబ్బంది నరికి, కాకరపాడు కలప డిపోకు తరలించారు. దీంతో ఆ బృందం కాకరపాడు కలప డిపోను కూడా పరిశీలించింది.

ఇటుక బట్టీల్లో 35 సీఎంటీ కలప

కృష్ణదేవిపేట సమీపంలో ఏర్పాటు చేసిన ఇటుక బట్టీల్లో చింతాలమ్మ ఘాట్‌లో నరికిన చెట్ల కొమ్మలు కనిపించాయి. ఇలా విక్రయించిన కలప దాదాపుగా 35 సీఎంటీలు ఉంటుందని అంచనా వేశారు. ఆ కలప తరలింపుపై ఇటుకబట్టీల వారి నుంచి వివరాలు తీసుకున్నారు. దీనిపై స్క్వాడ్ డీఎఫ్‌వో సోమసుందరంను సంప్రదిస్తే వచ్చిన ఫిర్యాదుపై విచారణ చేస్తున్నామన్నారు. నివేదికను ఉత్తరాంధ్ర సీసీఎఫ్‌కు అందజేస్తామని, తదుపరి చర్యలు ఆయన తీసుకుంటారని చెప్పారు.

ఎన్నికల ఏర్పాట్లు వేగవంతం

- అరకు రిటర్నింగ్ అధికారి, ఐటీడీఏ పీవో అభిషేక్



అధికారులకు తగిన సూచనలు ఇస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్

సాక్షి,పాడేరు: అరకు అసెంబ్లీ పరిధిలో ఎన్నికల ఏర్పాట్లు వేగవంతం చేయాలని అరకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ అధికారులను ఆదేశించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలను అరకు అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో పోలైన ఓట్ల కౌంటింగ్‌కు, స్ట్రాంగ్‌రూమ్‌గా ఎంపిక చేయడంతో ఐటీడీఏ పీవో సోమవారం ఆ భవనాలను పరిశీలించారు. ఇక్కడ ఏర్పాట్లపై రెవెన్యూ,ఎన్నికల విభాగం,ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షించారు.మండలాల వారీగా ఈవీఎంల డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు, రిసెప్షన్ కౌంటర్లు, ఎన్నికల సిబ్బందికి ఫుడ్ కౌంటర్లు ఏర్పాటుపై ఆయన ఆదేశాలిచ్చారు. డిగ్రీ కళాశాల మైదానంలో విద్యుత్ సౌకర్యంతో పాటు బారికేడ్లు ఏర్పాటు చేయాలని, కౌంటింగ్ సిబ్బందికి, రాజకీయ పార్టీల ఏజెంట్లకు ప్రత్యేక ప్రవేశ ద్వారాలు ఏర్పాటు చేయాలని, పోలింగ్ సిబ్బందికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా పూర్తిస్థాయిలో తగిన చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అరకులోయ తహసీల్దార్ పి.సోమేశ్వరరావు, గిరిజన సంక్షేమశాఖ ఈఈ డి.వి.ఆర్.ఎం.రాజు, డీఈఈ అనుదీప్ పాల్గొన్నారు.

256 బియ్యం బస్తాలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బియ్యం బస్తాలు

చింతూరు: మండలంలోని గంగన్నమెట్టలో ఓ ఇంట్లో నిల్వ ఉంచిన బియ్యం బస్తాలను చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య సోమవారం స్వాధీనం చేసుకున్నారు. గంగన్నమెట్టలో అక్రమంగా బియ్యం నిల్వ ఉంచారనే ఫిర్యాదు మేరకు వెళ్లి పరిశీలించగా ఓ ఇంట్లో 256 బస్తాలు లభ్యమైనట్టు పీవో తెలిపారు. దీనిపై విచారణ నిర్వహించి నివేదిక ఇవ్వాల్సిందిగా రెవెన్యూ సిబ్బందిని ఆదేశించానని, విచారణలో రేషన్‌బియ్యం అని తేలితే కఠిన చర్యల తీసుకుంటామని ఆయన చెప్పారు. స్వాధీనం చేసుకున్న మూటల్లో 91 గన్నీబ్యాగ్‌లు, 165 ప్లాస్టిక్ బస్తాలున్నట్టు చింతూరు ఆర్ఐ దారయ్య తెలిపారు. ఐటీడీఏ పీవో ఆదేశాల మేరకు బియ్యం మూటల నిల్వపై విచారణ నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. పట్టుబడిన బియ్యం మూటలు రేషన్ బియ్యంగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రైవేట్ స్కూళ్లలో ఉచిత విద్యకు స్పందన

- అల్లూరి జిల్లాలో 30 మంది దరఖాస్తు
- రాష్ట్రంలో విశాఖ నుంచే అత్యధికం
- ఈ నెల 25 వరకు దరఖాస్తుకు గడువు

విశాఖ విద్య : ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లలో ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశం కోసం విద్యార్థుల నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది. సోమవారం వరకు ఆన్‌లైన్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 18,231 దరఖాస్తులు అందాయి. వీటిలో అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి 30, అనకాపల్లి నుంచి 1,283, విశాఖ జిల్లా నుంచి 2,577 మంది దరఖాస్తు చేశారు. రాష్ట్రంలోని మిగతా జిల్లాల కంటే విశాఖ జిల్లా నుంచే ఎక్కువ మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ నెల 25 వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని గతంలో కంటే ఈ సారి ఎక్కువ మంది సద్వినియోగం చేసుకునేలా విద్యాశాఖాధికారులు ఫోకస్ పెట్టారు. ఉచిత విద్య ప్రవేశాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించటంతో పాటు, అర్హులైన వారంతా దరఖాస్తు చేసుకునేలా పర్యవేక్షణ చేసేందుకు సమగ్ర శిక్ష ఏపీవో అప్పలనాయుడును నోడల్ అధికారి అధికారిగా నియమించారు. అదే విధంగా మండల స్థాయిలో ఎంఈవోలకు బాధ్యతలు అప్పగించారు. గడువులోగా ఎక్కువ మంది దరఖాస్తు చేసుకునేలా సచివాలయ స్థాయిలో విస్తృత ప్రచారం కల్పించాలని డీఈవో చంద్రకళ క్షేత్ర స్థాయి సిబ్బందిని అప్రమత్తం చేశారు.

టెన్త్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



పదవ తరగతి ఏర్పాట్లపై సూచనలు ఇస్తున్న డీఈవో బ్రహ్మాజీ రావు



కేజీబీవీలో విద్యార్థినులతో మాట్లాడుతున్న డీఈవో

రాజవొమ్మంగి : జిల్లాలో పదవ తరగతి పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు డీఈవో పి.బ్రహ్మాజీ రావు తెలిపారు. పరీక్షల నిర్వహణపై రాజవొమ్మంగిలో హెచ్‌ఎంలు, ఎస్సీఆర్పీలు, ఉపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. స్థానిక విద్యావనరుల కేంద్రంలో రికార్డులను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 18వ తేదీ నుంచి ప్రారంభం కానున్న టెన్త్ పరీక్షల కోసం జిల్లా వ్యాప్తంగా 65 కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. పాడేరు డివిజన్‌లో 40, రంపచోడవరం డివిజన్‌లో 25 ఉన్నాయన్నారు. ఈ ఏడాది మొత్తం 12,051 మంది విద్యార్థినీవిద్యార్థులు టెన్త్ పరీక్షలు రాయనున్నట్టు తెలిపారు. వీరిలో 10,986 మంది రెగ్యులర్, 1,065 మంది ప్రైవేటు విద్యార్థులని చెప్పారు. నాలుగు ఫ్లైయింగ్ స్క్వాడ్స్ పరీక్షలు జరిగే విధానాన్ని నిత్యం పరిశీలిస్తాయన్నారు. సమస్యాత్మక కేంద్రాల్లో సిటింగ్ స్క్వాడ్‌లు ఉంటాయని తెలిపారు. అన్ని కేంద్రాల వద్ద 144వ సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ఇప్పటికే ఆర్టీసీ, పోలీస్, రెవెన్యూ, విద్యుత్, పారిశుధ్యం, వైద్యశాఖల అధికారులతో సమావేశాలు నిర్వహించినట్టు తెలిపారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు హాల్‌టిక్కెట్టు చూపించి ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించవచ్చన్నారు. పరీక్షకేంద్రాల ఏర్పాటు ఏ విధంగా జరిగింది, వాటిలో సదుపాయాలు పరిశీలించేందుకు త్రిసభ్య కమిటీని ప్రతి కేంద్రానికి పంపినట్టు తెలిపారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే తగిన చర్యలు చేపడతామన్నారు.

15 నిమిషాలు వెసులుబాటు

విద్యార్థులు ఉదయం 8.30 గంటలకే పరీక్షకేంద్రాలకు చేరుకోవాలని డీఈవో తెలిపారు. 15 నిమిషాల పాటు వెసులుబాటు ఉందని, అంత కంటే లేటుగా వస్తే అనుమతించబోమన్నారు. ముందు జాగ్రత్త చర్యగా విద్యార్థులు తమ పరీక్ష కేంద్రానికి ఒక రోజు ముందుగానే వెళ్లి చూడాలని, ఎంత దూరంలో ఉన్నదీ, తమకు ఏ రూం కేటాయించారు తదితర అంశాలను పరిశీలించుకోవాలన్నారు. ఇన్విజిలేషన్ ఆర్డర్స్ సోమవారం జారీ చేసినట్టు చెప్పారు. ఆయన వెంట ఇన్‌చార్జ్ ఎంఈవో-1 ఎల్.రాంబాబు ఉన్నారు.

కేజీబీవీలో విచారణ

కొయ్యూరు: స్థానిక కేజీబీవీని సోమవారం డీఈవో బ్రహ్మాజీరావు పరిశీలించారు. ఇటీవల ఈ పాఠశాలలో సీఆర్‌టీని విధుల నుంచి తొలగించిన నేపథ్యంలో వచ్చిన ఫిర్యాదులపై ఆయన విచారణ నిర్వహించారు. పాఠశాలలో మెనూ అమలుపై ఆయన విద్యార్థులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఇక్కడ బాలికలతో పనులు చేయిస్తున్నారన్న అంశంపై కూడా విచారణ చేశారు. మెనూ బాగుందని, తమతో పనులు చేయించడం లేదని పలువురు బాలికలు తెలిపారు. విధి నిర్వహణలో ఎవరూ నిర్లక్ష్యంగా ఉండవద్దని, నిబంధనలకు వ్యతిరేకంగా ప్రవర్తిస్తే చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. డీఈవో వెంట జీసీడీవో సూర్యకుమారి, ఎంఈవో రాంబాబు, ఎస్‌వో పరిమళ ఉన్నారు.

పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

- దట్టంగా కురుస్తున్న పొగమంచు



తలారిసింగి రోడ్డులో పొగమంచు

సాక్షి,పాడేరు: జిల్లాలో ఉష్ణోగ్రతలు క్రమేపి పెరుగుతున్నాయి. మహాశివరాత్రి తరువాత వాతావరణంతో మార్పులు చోటుచేసుకున్నాయి. చలిగాలుల తీవ్రత తగ్గినప్పటికీ పొగమంచు మాత్రం దట్టంగా కురుస్తోంది. సోమవారం పాడేరు మండలం మినుములూరులో 16 డిగ్రీలు, చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో 17.5 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అరకులోయ, అనంతగిరి, పాడేరు, చింతపల్లి ప్రాంతాల్లో పొగమంచు దట్టంగా కురిసింది. సూర్యోదయం తరువాత ఎండ చుర్రుమంది.

ఐటీడీఏ స్పందనకు 27 అర్జీలు



స్పందనలో దరఖాస్తులు స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్

రంపచోడవరం: స్థానిక ఐటీడీఏ సమావేశం హాలులో సోమవారం నిర్వహించిన ‘స్పందన’లో అధికారులు 27 అర్జీలు స్వీకరించారు. ఈసందర్భంగా రంపచోడవరం సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మాట్లాడుతూ ‘స్పందన’కు వచ్చిన సమస్యల్లో కొన్నింటిని వెంటనే పరిష్కరించినట్టు తెలిపారు.

- రంపచోడవరం మండలం ఐ.పోలవరం జంక్షన్ నుంచి నిర్మిస్తున్న జాతీయ రహదారి వల్ల బి.వెలమలకోటలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఇళ్లు, భూములు కోల్పోయిన తమకు నష్టపరిహారం చెల్లించాలని వంతల అచ్చయ్యమ్మ, ధర్మరాజులతో పాటు 50 మంది కోరారు.
- మారేడుమిల్లి మండలం చట్లవాడ గ్రామంలో నెల రోజుల నుంచి ఫైబర్ నెట్ పనిచేయడం లేదని వెంటనే మరమ్మతులు చేయించాలని బత్తుల ప్రతాప్ సింగ్, పల్లాల రమేష్ రెడ్డి అర్జీ సమర్పించారు.
- దేవీపట్నం మండలం కంబలం పాలెం గ్రామంలో సర్వే నంబర్ 56 /1, 1.1/2లో భూ సమస్య పరిష్కరించాలని ముర్రం బాపన్న దొర దరఖాస్తు అందజేశారు.
- మారేడుమిల్లి మండలం ఉప్పరుగోతులలోని పోర్ల బండ వీధిలో ఆరు కుటుంబాలకు కరెంట్ సౌకర్యం కల్పించాలని వంతల ముకుంద, వంతల చంద్రరావు అర్జీ అందజేశారు.
- అడ్డతీగల మండలం భీముడు పాకలు గ్రామంలోని సర్వేనంబర్ 62 /1సి గల భూ సమస్య పరిష్కరించాలని ఒమ్మంగి కాంతమ్మ దరఖాస్తు సమర్పించారు.

పేదల ఆకాంక్షలకు అనుగుణంగా జగనన్న పాలన

- ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చారు
- రంపచోడవరం ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత బాబు
- వైఎస్సార్‌సీపీ రోడ్ షోకు విశేష స్పందన


నెల్లిపాక రోడ్ షోలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు

ఎటపాక: పేదల ఆకాంక్షలకు అనుగుణంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి పాలన సాగించారని ఎమ్మెల్సీ అనంత బాబు, ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి తెలిపారు. సోమవారం ఎటపాక మండలం నెల్లిపాక గ్రామం నుంచి తోటపల్లి, గన్నవరం, గౌరిదేవిపేట మీదుగా నందిగామ వరకు రోడ్డు షో నిర్వహించారు. నెల్లిపాక వద్ద ఎమ్మెల్సీ,ఎమ్మెల్యేలకు వేలాది మంది పార్టీ శ్రేణులు పూలమాలలువేసి, హారతులిచ్చి ఘన స్వాగతం పలికారు. పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో రాజన్న రాజ్యం తేవాలనే ఆకాంక్షతో ఇచ్చిన ప్రతి హామీని ముఖ్యమంత్రి నెరవేర్చి ఈ ప్రభుత్వాన్ని పేదల ప్రభుత్వంగా మార్చారన్నారు. ఈ ప్రభుత్వంలో ఎటపాక మండలంలో సంక్షేమ పథకాల ద్వారా ఇప్పటి వరకు రూ.175 కోట్లను ప్రజలకు అందించినట్టు చెప్పారు. మూడు పార్టీలు కలిసి అధికారదాహంతో ప్రజల్ని మోసం చేసేందుకు మళ్లీ వస్తున్నాయని, ఆ నాయకులను తరిమికొట్టేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో జెడ్పీటీసీ ఉబ్బా సుస్మిత,ఎంపీపీ కాక కామేశ్వరి, సొసైటీ అధ్యక్షుడు పసుపులేటి లక్ష్మణరావు, సచివాలయాల మండల కన్వీనర్ గోసు ప్రశాంత్ , వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తానికొండ వాసు,ఉపాధ్యక్షుడు ఆకుల వెంకటరామారావు, జిల్లా కార్యదర్శి దామెర్ల రేవతి,ఎంపీటీసీలు, సర్పంచ్‌లు సచివాలయాల కన్వీనర్లు,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన మహిళకు అత్యవసర కాన్పు


తల్లీ, బిడ్డను ఫీడర్ అంబులెన్సులో ఆస్పత్రికి తరలిస్తున్న ఈఎంటీ కృష్ణ

చింతూరు: మండలంలోని ఇరకంపేటకు చెందిన గిరిజన మహిళ మడకం భద్రమ్మకు ఫీడర్ అంబులెన్సు ఈఎంటీ భూక్యా కృష్ణ అత్యవసర కాన్పు నిర్వహించారు. గర్భిణి భద్రమ్మకు పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు ఫీడర్ అంబులెన్సు ఈఎంటీ కృష్ణకు సమాచారం పంపారు. భద్రమ్మను అంబులెన్సు ద్వారా పీహెచ్‌సీకి తరలించే నిమిత్తం గ్రామానికి వెళ్లిన కృష్ణ పురిటినొప్పులతో ఉన్న ఆమె అత్యవసర పరిస్థితిని గమనించారు. ఆశా వర్కర్ సాయంతో భద్రమ్మకు ఇంటివద్దనే కాన్పు నిర్వహించగా మగబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం తల్లీ, బిడ్డను చికిత్స నిమిత్తం అంబులెన్సులో ఏడుగురాళ్లపల్లి పీహెచ్‌సీకి తరలించగా వైద్యాధికారి చైతన్య పరీక్షించి ఇద్దరూ క్షేమంగా ఉన్నట్లు తెలిపారు.

మన్యంలో అన్ని రంగాల్లో అభివృద్ధి, ఇంటింటా సంక్షేమం


కళాశాల ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర

ముంచంగిపుట్టు: గిరిజన ప్రాంతంలో గతంలో ఎన్నడూ చూడని అభివృద్ధి, సంక్షేమం నేడు జరుగుతుందని విశాఖ ఉమ్మడి జిల్లాల జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు.మండలంలోని కించాయిపుట్టు పంచాయతీ పెద్దపుట్టు గ్రామంలో ఉపాధి నిధులు రూ.30 లక్షలతో ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ప్రహరీ నిర్మాణానికి సోమవారం జెడ్పీ చైర్ పర్సన్ సుభద్ర కొబ్బరికాయ కొట్టి ప్రత్యేక పూజలు చేసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో తీసుకువచ్చిన విప్లవాత్మకమైన మార్పులు అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నమన్నారు. ముఖ్యంగా గిరిజన విద్యారంగంలో ఊహకు కూడా అందని మార్పులు చోటు చేసుకున్నాయన్నారు. నాడు-నేడు వంటి కార్యక్రమంతో పాఠశాలల స్థితిగతులు పూర్తిగా మారిపోయాయన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు నాడు నేడు ద్వారా కోటి రూపాయలతో సౌకర్యాలు కల్పిస్తున్న ఘనత జగనన్న ప్రభుత్వానిదే అన్నారు. కళాశాల బాలికలకు వసతి గృహం పూర్తయిందని, త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. ఎంపీపీ అరిసెల సీతమ్మ, వైస్ ఎంపీపీ పి.సత్యనారాయణ, సర్పంచ్ బాబూరావు, ఎంపీటీసీలు సుబ్బలక్ష్మీ, గణపతి, మండల జేసీఎస్ కన్వీనర్ కొండలరావు, నేతలు జయదేవ్, మూర్తి, తిరుపతి, పద్మరావు, రాంప్రసాద్, దాసు, పిత్‌బాష్ తదితరులు పాల్గొన్నారు.

నాడు-నేడుతో మారిన పాఠశాలల రూపురేఖలు


పాఠశాలలకు బెంచీలు పంపిణీ చేస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు: నాడు-నేడు పథకంతో పాఠశాలల రూపురేఖలు మారాయని ఐటీడీఏ పీవో అభిషేక్ అన్నారు. పలు పాఠశాలలకు మొదటి విడతలో సర్పంచ్‌లు 60 బెంచీలను సమకూర్చారు. మండల పరిషత్ కార్యాలయంలోని సోమవారం జరిగిన కార్యక్రమంలో పీవో... సర్పంచ్‌లను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పలు పాఠశాలల్లో 15వ ఆర్థిక సంఘ నిధులు నుంచి బెంచీలు సమకూర్చాలని సర్పంచ్‌లు కోరినట్టు చెప్పారు. ఆ మేరకు సర్పంచ్‌లు మొదటి విడతలోని 60 బెంచీలను అందజేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలోని ఎంపీపీ రత్నకుమారి, ఎంపీడీవో నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు


పరీక్షల విభాగంలో సీసీ కెమెరాల దృశ్యాలను పరిశీలిస్తున్న ఇంటర్ బోర్డు అధికారులు

సాక్షి,పాడేరు: జిల్లా వ్యాప్తంగా ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. జిల్లాలోని 27 కేంద్రాలల్లో పరీక్షలు జరుగుతున్నాయి. ఇంటర్ పరీక్షల జిల్లా పర్యవేక్షకులు వినోద్‌బాబు,జిల్లా ఇంటర్ వృత్తివిద్యాశాఖ అధికారి అప్పలరామం జిల్లాలోని పరీక్ష కేంద్రాలను తనిఖీ చేస్తున్నారు. సోమవారం జరిగిన పరీక్షకు 5,254మందిగాను 5054 మంది హాజరయ్యారు. మిగిలిన 200మంది విద్యార్థులు పరీక్షకు గైర్హజరయ్యారు.

ఆటో బోల్తా.. మహిళ మృతి

- ముగ్గురికి తీవ్ర గాయాలు


దూలమ్మ మృతదేహం

కూనవరం: ఆటో బోల్తా పడిన ప్రమాదంలో ఓ మహిళ మృతిచెందింది. ఎస్‌ఐ వెంకటేష్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. చింతూరు మండలం గూడూరు పంచాయతీ తూలుగొండ గ్రామనికి చెందిన కూలీలు పొలం పనుల నిమిత్తం కూనవరం గ్రామం వచ్చారు. పనులు ముగించుకుని మధ్యాహ్నం స్వగ్రామానికి తిరిగి ఆటోలో బయలుదేరారు. వేగంగా వెళుతున్న ఆటో సీతారామ్‌పురం సమీపంలో రోడ్డు డౌన్ దిగుతుండగా బ్రేక్ పడక పోవడంతో అదుపు తప్పి బోల్తాపడింది. ఆటోలో ప్రయాణిస్తున్న కూలీల్లో తూలుగోడ గ్రామానికి చెందిన కుంజా దూలమ్మ (38) తీవ్రంగా గాయపడింది. ఆమె పరిస్థితి విషమంగా మారడంతో కోతులగుట్టలో ప్రభుత్వ ఆస్పత్రికి (సీహెచ్‌సీ) తరలించి చికిత్స అందిస్తుండగానే మృతి చెందింది. మృతురాలికి భర్త పెంటయ్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. లేడి లక్ష్మయ్య, జోగమ్మ, కె.ధరణిలకు తీవ్ర గాయాలు కాగా డ్రైవర్‌తో సహా పలువురికి స్వల్ప గాయాలైనట్టు ఎస్‌ఐ తెలిపారు. కె.ధరణికి మెరుగైన వైద్యం కోసం భద్రాచలం రిఫర్ చేసినట్టు డాక్టర్ మహేష్ తెలిపారు. కేసు నమోదు చేసి, శవ పంచనామా అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్టు ఎస్‌ఐ చెప్పారు.

బాధ్యతగా పనిచేస్తే గుర్తింపు

- ఏఎస్పీ జగదీష్ అడహళ్లి


బదిలీ అయిన సీఐ రాంబాబును సత్కరిస్తున్న రంపచోడవరం ఏఎస్పీ జగదీష్ అడహళ్లి

అడ్డతీగల: అసాంఘిక శక్తులను కట్టడి చేసి, సమాజంలో శాంతి భద్రతలను పరిరక్షించే ఉదాత్తమైన బాధ్యత పోలీసులపై ఉందని రంపచోడవరం ఏఎస్పీ జగదీష్ అడహళ్లి అన్నారు. అడ్డతీగల సీఐగా పనిచేసి బదిలీ అయిన వై.రాంబాబును అడ్డతీగల ఎస్‌ఐ అప్పలరాజు ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ మాట్లాడుతూ బాధ్యతగా పనిచేస్తే గుర్తింపు దానంతట అదే వస్తుందన్నారు. సీఐగా రాంబాబు అందించిన సేవలను కొనియాడారు. అనంతరం ఆయనను పోలీసు సిబ్బంది గజమాలతో ఘనంగా సన్మానించారు. అడ్డతీగల, వై.రామవరం, గంగవరం ఎంపీపీలు బొడ్డపాటి రాఘవ, కడబాల ఆనంద్, పల్లాల కస్తూరెడ్డి, జెడ్పీటీసీ బేబీరత్నం, వై.రామవరం,దుశ్చర్తి,గంగవరం ఎస్‌ఐలు,అడ్డతీగల సర్కిల్ పరిధిలోని పలువురు సిబ్బంది ,పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

అస్వస్థతతో ఉపాధి కూలీ మృతి


అప్పారావు (ఫైల్)

రాజవొమ్మంగి: ఉపాధి పనులకు వెళ్లిన రాజవొమ్మంగి ఎస్సీ కాలనీకు చెందిన అయినవిల్లి చిన అప్పారావు (60) సోమవారం తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. అతనిని కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. పనులు చేస్తుండగా చెమటలు పట్టడంతో సొమ్మసిల్లిపోయాడని, హుటాహుటిన స్థానిక పీహెచ్‌సీకి తరలించినట్టు కూలీలు చెప్పారు.ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు పంపారు. అప్పారావు గుండెపోటుతో మృతిచెందాడని వైద్యులు నిర్ధారించారు.

అటవీ ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

వీఆర్‌పురం: రామవరం అటవీ ప్రాంతంలో గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం లభించినట్టు ఇన్‌చార్జ్ ఎస్‌ఐ బి.వెంకటేష్ సోమవారం తెలిపారు. రామవరం పంచాయతీ కారంగుంపునకు సమీపంలోని అటవీ ప్రాంతంలో మృతదేహం ఉందనే సమాచారం అక్కడి వెళ్లి పరిశీలించినట్టు చెప్పారు. మృతిచెందిన వ్యక్తి వయసు సుమారు 60 సంవత్సరాలు ఉంటాయని ప్రాథమికంగా అంచనావేసినట్టు చెప్పారు. పరిసర గ్రామాల్లో రెండు నెలల నుంచి ఓ వృద్ధుడు యాచిస్తూ తిరుగుతున్నాడని విచారణలో తెలిందన్నారు. ఆ వ్యక్తే ఆహారం, నీరు అందక మృతి చెంది ఉంటాడని గ్రామస్తులు భావిస్తున్నట్టు ఎస్‌ఐ చెప్పారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి

సాక్షి,పాడేరు: గిరిజన రైతులంతా వ్యవసాయ అనుబంధ రంగాల్లో స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి సాధించాలని పశుసంవర్ధకశాఖ జేడీ సీహెచ్.నరసింహులు కోరారు. వాసన్ సంస్థ ఆధ్వర్యంలో ఎంపిక చేసిన రైతులకు నాటుకోళ్ల యూనిట్లు, పిండిమర యంత్రాలను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనుల రైతులకు వ్యవసాయం, ఇతర అనుబంధ రంగాల్లో వాసన్ సంస్థ తగిన ప్రోత్సాహం అందించడం సంతోషంగా ఉందన్నారు. గ్రామాల్లో పిండిమర యంత్రాలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా ఉపాధి పొందడంతో గిరిజనులకు మేలు జరుగుతుందన్నారు.నాటుకోళ్ల పెంపకంతోను మంచి ఆదాయం వస్తుందన్నారు.గ్రామాల్లో పశుసంవర్ధక కార్యక్రమాలను విస్తృతం చేశామన్నారు. ఏడీ రాజా రవికుమార్, వాసన్ సంస్థ ప్రతినిధులు సన్ని, నరసింగరావు, దామోదర్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

అగ్నివీర్ రిక్రూట్‌మెంట్‌పై అవగాహన


ఆర్మీ అధికారులతో విద్యార్థులు

అరకులోయటౌన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఇండియన్ ఆర్మీ అసిస్టెంట్ రిక్రూట్‌మెంట్ ఆఫీసర్ భగవత్‌సింగ్, హవాల్దార్ ఆశిష్‌ల ఆధ్వర్యంలో అగ్నివీర్ రిక్రూట్‌మెంట్‌పై సోమవారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ అగ్ని వీర్ రిక్రూట్‌మెంట్ కొసం 22తేదీ లోగా అన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇన్‌చార్జి ప్రిన్స్‌పాల్ పి.కొండబాబు, ఎన్ఎస్ఎస్ పీఓలు వై.విజయలక్ష్మీ, ఎం.అనితకుమారి, పి.నాగబాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతులకు మేలు

- రంపచోడవరం ఎమ్మెల్యే ధనలక్ష్మి


చింతూరులో లబ్ధిదారులకు వ్యవసాయ పరికరాలు అందచేస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి

చింతూరు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రైతులకు ఎంతోమేలు జరిగిందని, ప్రభుత్వ పథకాలతో వారి లబ్ధి పొందారని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. ఐటీడీఏ, ఉద్యానశాఖ ఆధ్వర్యంలో రాయితీపై ఇచ్చే వ్యవసాయ పరికరాలను సోమవారం ఆమె చింతూరులో లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుభరోసా ద్వారా రైతులకు పెట్టుబడి సాయం అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని చెప్పారు. రైతుల మేలుకోసం రైతుభరోసా కేంద్రాలు ఏర్పాటుచేసి రైతులు సుస్థిర వ్యవసాయం చేసేలా చర్యలు చేపట్టినట్టు ఆమె తెలిపారు. విపత్తుల సమయాల్లో పంటనష్టం, సబ్సిడీపై విత్తనాలు, వ్యవసాయ పరికరాలతో పాటు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించినట్టు చెప్పారు. ఈ సందర్భంగా 90 శాతం రాయితీపై 75 బ్యాటరీ స్ప్రేయర్లు, 25 తైవాన్ స్ప్రేయర్లు, 5 పవర్ వీడర్లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ కమిషన్ సభ్యుడు చిచ్చడి మురళి, ఎంపీపీ సవలం అమల, వైస్ ఎంపీపీలు మేడేపల్లి సుధాకర్, యడమ అర్జున్, జేసీఎస్ మండల కన్వీనర్ కోట్ల కృష్ణ, నాయకులు ప్రవీణ్, బాబూరావు, మురళి, రాంప్రసాద్, సాయి, రాజు, పార్టీకి చెందిన ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

గుండెపోటుతో టూరిజం కార్మికుడు మృతి


జయరాం (ఫైల్)

అనంతగిరి: బొర్రాగుహలు వద్ద గైడ్‌గా విధులు నిర్వహిస్తున్న బొర్రా గేటువలస గ్రామానికి చెందిన జయరాం(50)గుండెపోటుతో సోమవారం మృతి చెందాడు. ఇంటి వద్ద ఉదయం తీవ్రంగా గుండెపోటుకు గురై అపస్మారస్థితికి చేరుకుని, మృతి చెందినట్టు స్థానికులు తెలిపారు. దహన సంస్కరణ నిమిత్తం మృతుడి కుటుంబానికి బొర్రా మేనేజర్ గౌరీ టూరిజం శాఖ నుంచి రూ.25వేలు, టూరిజం కార్మిక యూనియన్ జిల్లా అధ్యక్షుడు రాజు రూ.5వేల ఆర్థిక సాయం చేశారు. సర్పంచ్ అప్పారావు, గైడ్ రాము, వీఆర్పీ గోపి, వార్డు మెంబర్ దారు తదితరులు పాల్గొన్నారు.

200 కిలోల గంజాయి స్వాధీనం

- ఇద్దరి అరెస్టు
- ఒక ట్రాక్టర్, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం

చింతపల్లిరూరల్: ట్రాక్టర్‌పై తరలిస్తున్న 200 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ఇద్దరిని అరెస్టు చేసినట్టు స్థానిక సీఐ రమేష్ తెలిపారు. నిందితుల నుంచి గంజాయితో పాటు ట్రాక్టర్, రెండు సెల్ ఫోన్లు, రూ.1200 నగదు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ రూ.20 లక్షలు ఉంటుందని అంచనా. సీఐ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గంజాయి రవాణాపై అన్నవరం ఎస్‌ఐ రాజారావుకు సమాచారం రావడంతో లోతుగెడ్డ పంచాయతీ చెరుకుంపాకల జంక్షన్ వద్ద సిబ్బందితో కలిసి సోమవారం వాహనాలు తనిఖీ చేశారు. ఈ సమయంలో లోతుగెడ్డ నుంచి ట్రాక్టర్ మీద వస్తున్న ఇద్దరు వ్యక్తులు పోలీసులను చూసి వాహనాన్ని ఆపి పరారయ్యేందుకు ప్రయత్నించారు. వెంబడించి పోలీసులు వారిని పట్టుకున్నారు. జి.మాడుగుల మండలం లువ్వాసింగి పంచాయతీ, కిల్లుపల్లి గ్రామానికి చెందిన పాంగి శ్రీను,కొర్ర సత్తిబాబుగా గుర్తించారు. వారిని విచారించగా రెండు రోజుల కిందట నర్సీపట్నానికి చెందిన ఓ వ్యక్తి ఒడిశా రాష్ట్రం చింతల ధూళి గ్రామం నుంచి ట్రాక్టర్‌లో లోడు చేసిన 200 కిలోల గంజాయిని తెచ్చి కిల్లుపల్లి గ్రామంలో తమకు అప్పగించాడని నిందితులు చెప్పారు. ఈ లోడును డౌనురు వద్ద అప్పగించాలని రూ.పదివేలకు ఒప్పందం కుదుర్చుకున్నట్టు వారు తెలిపారు. నిందుతులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కి తరలించామని, పరారీలో ఉన్న నిందితులను కూడా త్వరలో పట్టుకుంటామని సీఐ రమేష్ తెలిపారు.

చర్మవ్యాధుల నివారణపై ఐటీడీఏ ప్రత్యేక దృష్టి

సాక్షి,పాడేరు: పాడేరు ఐటీ డీఏ పరిధిలోని పలు గిరిజన విద్యాలయాల్లో గిరిజన విద్యార్థులకు చర్మవ్యాధుల నివారణపై పాడేరు ఐటీడీఏ పివో వి.అభిషేక్ ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. పలు గిరిజన విద్యాలయాల్లో విద్యార్థులు గజ్జి, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి స్థానికంగా పీహెచ్‌సీల్లో వైద్యసేవలు కల్పిస్తున్నారు.కొంతమందికి చర్మవ్యాధులు నయం అవుతున్నప్పటికి మరికొందరికి మరలా సోకుతున్నాయి.ఈ పరిస్థితిలో విద్యాలయాల్లోని విద్యార్థులకు చర్మవ్యాధుల నిపుణులతో వైద్య పరీక్షలు నిర్వహించేందుకు ఐటీడీఏ పీవో అభిషేక్ నిర్ణయించారు.ఈ మేరకు పాడేరులోని ప్రభుత్వ సర్వజన జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విశ్వామిత్రాతో సోమవారం గిరిజన విద్యాలయాల్లో వైద్యశిబిరాలపై సమీక్షించారు. జిల్లా ఆస్పత్రిలో అందుబాటులో ఉన్న చర్మవ్యాధుల వైద్యనిపుణులతో పాటు ఇతర వైద్యులతో రోజు కనీసం రెండు గిరిజన విద్యాలయాల్లో విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించేందుకు నిర్ణయించారు. ఈ మేరకు మంగళవారం హుకుంపేట మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ ఇంగ్లిషు మీడియం బాలికల ఆశ్రమ పాఠశాల, పెదగరువులోని గిరిజన సంక్షేమ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రత్యేక వైద్య శిబిరాలను ఐటీడీఏ పీవో వి.అభిషేక్ ప్రారంభించనున్నారు.

నాణ్యమైన కాఫీ ఉత్పత్తికి కృషి


రైతులకు కాఫీ పల్పర్ యంత్రాన్ని పంపిణీ చేస్తున్న అధికారులు

చింతపల్లిరూరల్: నాణ్యమైన కాఫీ ఉత్పత్తికి గిరిజన కాఫీ రైతులు కృషి చేయాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి రమేష్ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం రైతులకు కాఫీ బోర్డు నుంచి 50 శాతం, ఏపీఎఫ్‌పీఎస్ నుంచి 35 శాతం సబ్సిడీ ద్వారా మోటర్ పల్పర్ యంత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులు పండించే కాఫీకి అంతర్జాతీయ మార్కెట్‌లో ప్రత్యేక గుర్తింపు ఉందని , రైతులు కాఫీ ఉత్పత్తిలో మెలకువలు నేర్చుకోని అధిక ఆదాయాన్ని పొందాలని సూచించారు. కాఫీ బోర్డు డిప్యూటీ డైరెక్టర్ సామల రమేష్ , ఏపీఎఫ్‌పీఎస్ జోనల్ మెనేజర్ సాయి శ్రీనివాస్, కాఫీ బోర్డు మెంబర్ జైతి ప్రభాకర్, ఇరిగేషన్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రహీమ్, చింతపల్లి యూబీఐ మెనేజర్ నారాయణరావు, జెఎల్‌వో ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.